క్లుప్తంగా

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు



బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్ శివారులో ఉన్న రంగనాథుని ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు యజ్ఞం నిర్వహించి గ్రామం నుంచి ఆలయం వరకు ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, అన్నదానం చేయనున్నట్లు ఆయల కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా వార్షికోత్సవం



బాల్కొండ: మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఉన్నత పాఠశాల ఆవరణలో సరస్వతీమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి 23 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామలక్ష్మి, హెచ్ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి



మోర్తాడ్: గ్రామాల్లో అభివృద్ధి పనులకు సహకారం అందించాలని ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి గిర్మాజి గోపి, మాజీ ఎంపీపీ గిర్మాజి గంగాధర్ కోరారు. శనివారం ఎమ్మెల్సీని వారు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎమ్మెల్సీ కోటా నిధులను మోర్తాడ్ మండలానికి మంజూరు చేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అబ్బాస్, రామకృష్ణ, నరేశ్ యాదవ్, భూపతి, కొట్టూరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వేల్పూర్: మండలంలోని రామన్నపేట్, పడగల్, వాడి గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ శనివారం పరామర్శించారు. రామన్నపేట్‌లో భూమారెడ్డిని, పడగల్‌లో రాజముత్యం, వాడిలో సుమన్ కుటుంబాలను ఆయన పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వేల్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, నాయకులు ఉన్నారు.

రామయ్య సేవలో వర్ని భక్తులు



వర్ని: అయోధ్యలోని రామాలయంలో మండలానికి చెందిన భక్తులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయోధ్యలో సేవ చేసేందుకు పలువురు రామభక్తులు, బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈనెల 9నుంచి 20వ తేదీ వరకు అయోధ్యలో సేవ చేయనున్నట్లు మండల బీజేపీ అధ్యక్షులు శంకర్ తెలిపారు. బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌గౌడ్, కార్యవర్గ సభ్యుడు రాజు తదితరులు అయోధ్యలో ఉన్నారు.

రామాలయంలో పూజలు



నిజామాబాద్ సిటీ: నగరంలో ప్రసిద్ధిగాంచిన ఖిల్లా రామాలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సం సంప్రోక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. మూడురోజులపాటు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు కందాళై నరసింహమూర్తి తెలిపారు. ఈసందర్భంగా శనివారం అగ్నిప్రతిష్ఠ, చక్రపరిమళ్లకు జలాధివాసం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేడు నిర్వహించనున్న పూజా కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరుతున్నారు.

అభివృద్ధిని విస్మరించిన బీఆర్‌ఎస్

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విమర్శ
- జానకంపేట్‌లో కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ



కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి(బోధన్): గత ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని, నాటి ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు ధనార్జనే ధ్యేయంగా పని చేశారని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని జానకంపేట్ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వద్ద కల్యాణమండపం నిర్మాణానికి ఎమ్మెల్యే శనివారం భూమిపూజ చేశారు. రూర్బన్ ప్రాజెక్ట్‌లో భాగంగా గత రెండేళ్ల క్రితం కల్యాణమండపం నిర్మాణానికి రూ.78 లక్షలు మంజూరుకాగా, ఆ నిధులతో పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూర్బన్ నిధులు మంజూరైనప్పటికీ కల్యాణమండపం నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రద్ధ చూపలేదన్నారు.

ప్రత్యేక పూజలు

జానకంపేట్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ధర్మారం గ్రామస్తుల వినతి

జిల్లాలోని అనేక చెరువుల్లో గుర్రపు డెక్క కారణంగా గంగపుత్రులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని మండలంలోని ధర్మారం గ్రామస్తులు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందిస్తూ.. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని గంగపుత్రులకు హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరికలు



బోధన్‌టౌన్/ఎడపల్లి/నవీపేట: ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి బోధన్ పట్టణంతోపాటు ఎడపల్లిలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో కొప్పర్తి, కుమ్మన్‌పల్లి, చిన్న మావంది మాజీ సర్పంచులు బుజ్జి, గంగాధర్, సాయిలు, రాములు, సంగం సింగిల్ విండో మాజీ చైర్మన్ అబ్బారెడ్డి, ఎడపల్లి మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులతోపాటు సింగిల్‌విండో చైర్మన్ పోల మల్కారెడ్డి, బాపూనగర్ గ్రామ మాజీ సర్పంచ్ సునీతారవి దంపతులు, మాజీ సర్పంచ్ కిరణ్ తదితరులున్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నవీపేట జెడ్పీటీసీ సవితబుచ్చన్న, నవీపేట ఎంపీటీసీ మీననవీన్ దంపతులు, లింగాపూర్ ఎంపీటీసీ దేవక్కల సాధన, లింగాపూర్, గాంధీనగర్ గ్రామాల మాజీ సర్పంచులు బత్తూర్ సాయిలు, ఆదిలక్ష్మి, నిజాంపూర్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

రైల్వేస్టేషన్లను పునఃప్రారంభించాలని వినతి

శక్కర్‌నగర్, ఎడపల్లి రైల్వే స్టేషన్లను పునఃప్రారంభించాలని విద్యార్థి జేఏసీ నాయకుడు శివకుమార్ ఎమ్మెల్యేకు విన్నవించారు. రైల్వే సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని, బోధన్, గాంధీ పార్కు రైల్వే స్టేషన్లలో మౌళిక వసతులు కల్పించాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్లకు సన్మానం



కమిషనర్లను సన్మానిస్తున్న మెప్మా సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్‌ను, బదిలీపై వచ్చిన నూతన కమిషనర్ ఏ.రాజును మెప్మా అధికారులు, సిబ్బంది శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు నీలిమ, రాజలింగం, సంతోష్, ఆర్పీలు పాల్గొన్నారు. నూతన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజును బీఆర్‌ఎస్ పట్టణఅధ్యక్షుడు పూజ నరేందర్, పృథ్వీ, అగ్గు క్రాంతి, రాజు, మీర శ్రావణ్ సన్మానించారు. పట్టణంలో దోమలబెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సాలూర తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సాలూర గ్రామస్తులు

బోధన్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సాలూర మండల తహసీల్దార్ రమేశ్‌ను తహసీల్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, గ్రామపెద్దలు కేజీ గంగారాం, భయ్యన్ సురేశ్‌పటేల్, డిస్కో సాయిలు, కండెల సంజీవ్‌కుమార్, బండె శివరాజ్, కన్నె రమేశ్, మోహన్ పాల్గొన్నారు.

రెంజల్ తహసీల్దార్‌గా ఖలీం

రెంజల్(బోధన్): రెంజల్ తహసీల్దార్‌గా ఖలీం శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన రాంచందర్ కలెక్టర్ కార్యాలయ ఏవోగా వెళ్లగా, ఆయన స్థానంలో జక్రాన్‌పల్లి నుంచి ఖలీం బదిలీపై వచ్చారు.

సైన్స్ టాలెంట్‌టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



డొంకేశ్వర్‌లో బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం



మాక్లూర్ మండలస్థాయిలో..

డొంకేశ్వర్/మాక్లూర్/వేల్పూర్/మోర్తాడ్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభకనబర్చారు. డొంకేశ్వర్ మండల స్థాయిలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని సహస్ర మొదటి, తొమ్మిదో తరగతి విద్యార్థిని రక్షిత ద్వితీయ స్థానంలో నిలిచారు. హెచ్‌ఎం సురేశ్‌కుమార్ వారిని అభినందించారు. మాక్లూర్ మండల స్థాయిలో మానిక్‌బండార్ పాఠశాల విద్యార్థిని మనోజ్ఞ ప్రథమ, మదన్‌పల్లికి చెందిన ఎస్ అర్జున్ ద్వితీయ, స్వేచ్ఛ తృతీయ స్థానంలో నిలిచారు. వేల్పూర్ మండల స్థాయిలో కుకునూర్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని సహస్ర ప్రథమ, వేల్పూర్ హైస్కూల్ విద్యార్థి రితేశ్ ద్వితీయస్థానంలో నిలిచారు. మోర్తాడ్ మండల స్థాయిలో సుంకెట్ పాఠశాల విద్యార్థిని శ్రీహిత ప్రథమ, దొన్కల్‌కు చెందిన హారతి ద్వితీయస్థానంలో నిలిచారు. ఆయా మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు విజేతలను అభినందించి బహుమతులు అందజేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈనెల 20న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.



వేల్పూర్ మండలస్థాయి విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



మోర్తాడ్ మండలస్థాయి విజేతలతో ఉపాధ్యాయులు

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

నిజామాబాద్‌నాగారం: బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధైర్య పడొద్దని, అండగా ఉంటానని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా భరోసా ఇచ్చారు. మళ్లీ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శనివారం మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా పార్టీ కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి, వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలో బీఆర్‌ఎస్ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కాంగ్రెస్ అమలుకాని హామీలనిచ్చి ప్రజలను మోసం చేసారని, రాబోయే రోజుల్లో ఆ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సిర్పరాజు, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాష్, రవి చందర్, దండు చంద్ర శేఖర్, దారం సాయిలు, మా యావర్ సాయిరాం, రాజేంద్రప్రసాద్, మీర్ మజాజ్ అలీ,నవీద్ ఇక్బాల్, ఫయాజ్, కార్పొరేటర్లు ఖుద్దూస్, లావణ్య నవీన్, ధర్మపురి, ఉమారాణి శ్రీనివాస్, ఉమారాణి ముత్యాలు, సాయివర్ధన్, గాండ్ల లింగం రాజు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు సేవాలాల్ మహరాజ్



పూజలు నిర్వహిస్తున్న డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

వర్ని: గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ అందరికీ ఆదర్శప్రాయుడని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సేవాలాల్ తండాలో శనివారం నిర్వహించిన జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ మందిర 9వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బోగ్‌భండార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వీడ్కోలు సంబురం తీపిజ్ఞాపకం



ఆర్మూర్: పదో పూర్తి చేసుకుంటున్న విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమం జీవితాంతం తీపిజ్ఞాపకంగా మిగిలిపోతుందని పట్టణంలోని నలంద పాఠశాల కరస్పాండెంట్లు ప్రసాద్, సాగర్ అన్నారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్థానిక ఫంక్షన్ హాల్‌లో శనివారం వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు తమ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కులగణనతో ఎంతో మేలు

ఆర్మూర్‌టౌన్: బడుగు బలహీన వర్గాల ప్రజలకు కుల గణనతో ఎంతోమేలు జరుగుతుందని మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీలో కుల గణన తీర్మానం చారిత్రక ఘట్టమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాల ప్రణాళికను రూపొందించేందుకు వీలుగా కులగణన చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని పేర్కొన్నారు. డిక్లరేషన్‌లో పొందుపర్చిన ప్రకారం దళిత రిజర్వేషన్లు 18శాతానికి పెంచి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్ జన్మదిన వేడుకలు



బోధన్ ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



బాల్కొండలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించాయి. నాయకులు కేక్‌లు కట్ చేసి పలుచోట్ల ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆలయాల్లో పత్ర్యేక పూజలు నిర్వహించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్ఞానంతోనే మోక్షం లభిస్తుంది



వజ్రోత్సవాల్లో పాల్గొన్న పీఠాధిపతులు



హాజరైన భక్తులు

బాల్కొండ: జ్ఞానంతోనే మోక్షం లభిస్తుందని సత్యానంద స్వామి మహర్షి ఆశ్రమాలపీఠాధిపతి ఆచార్య శ్రీహరి తీర్థ స్వామి అన్నారు. మండలంలోని కిసాన్‌నగర్‌లో ఉన్న గీతాశ్రమ వజ్రోత్సవ వేడుకలు రెండోరోజైన శనివారం ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా శ్రీహరితీర్థ మాట్లాడుతూ.. జ్ఞానం ద్వారా మోక్షం లభిస్తుందని అన్నారు. మానవ దేహమే దేవాలయమని, ప్రజలు భక్తిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గీతాశ్రమ భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సునీత

కమ్మర్‌పల్లి: 'బేటీ బచావో బేటీ పడావో' పథకంలో భాగంగా మహిళాశిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని కేజీబీవీలో శనివారం 'జీవన నైపుణ్యాలు, మానసిక ఆరోగ్యం'పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సైకాలజిస్ట్ సునీత విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, మానసిక ఆరోగ్య పరిస్థితుల గురించి వివరించారు. ఒత్తిడిని జయించడం, పరీక్షల సమయంలో నేర్చుకున్న అంశాలను ప్రెజెంట్ చేసే విధానాన్ని వివరించారు. ఐసీడీఎస్ ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, బాలల పరిరక్షణ అధికారి నేగెల్లి బాబు, మహిళాసాధికారత కేంద్రం నిజామాబాద్ జెండర్ స్పెషలిస్ట్ సౌమ్య, కవిత, స్పెషల్ ఆఫీసర్ గంగామణి పాల్గొన్నారు.

కళాశాలపై చర్యలు తీసుకోవాలి



ఆర్మూర్: విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న బీఎడ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం నరేందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బీఎడ్ కళాశాల ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ బీఎడ్ కళాశాలకు 2018లో అనుమతులు నిరాకరించారని, అయినప్పటికీ కళాశాల కొనసాగుతున్నదన్నారు. కళాశాల డెవలప్‌మెంట్ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తూ మరోవైపు పరీక్ష ఫీజును యూనివర్సిటీ ఫీజుకు అదనంగా 50 శాతం వసూలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరించడం తగదన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఏరియా ప్రధాన కార్యదర్శి డి నిఖిల్, నాయకులు బీరుగొండ, కృష్ణ, కార్తీక్, ఈశ్వర్, రిశిత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్‌కు ఎంపిక



జెంటిల్‌కిడ్స్ విద్యార్థులు



కాంతి హైస్కూల్ విద్యార్థులు

ఆర్మూర్/ఆర్మూర్‌టౌన్: జిల్లా కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో ఆర్మూర్ పట్టణంలోని జెంటిల్ కిడ్స్, లోటస్ స్మార్ట్, కాంతి, లిల్లిపుట్ స్కూళ్ల విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనబరిచారు. జెంటిల్ కిడ్స్ పాఠశాలకు చెందిన రిద్ధి, వర్షిత్, లిల్లిపుట్ స్కూల్‌కు చెందిన హేమంత్, శిరీష, కాంతి హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్లు ప్రకాశ్ గుజరాతి, రామకృష్ణ, కాంతి గంగారెడ్డి తెలి పారు. అలాగే లోటస్ స్మార్ట్ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభకనబర్చినట్లు కరస్పాండెంట్ పోహర్ అంబిక తెలిపారు. విద్యార్థులను ఆయా పాఠశాల ల ఉపాధ్యాయులు అభినందించారు.

బీసీల అభ్యున్నతికి కృషి



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న బీసీ సంఘ నాయకులు

నిజామాబాద్ రూరల్: బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని జిల్లా బీసీ హక్కుల పరిరక్షణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాయవార్ రాజేశ్వర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణనపై తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం నగరంలో సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టడం చారిత్రాత్మకమైన నిర్ణయం అని వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కులగణన చేపట్టడం, బీసీలకు పెద్ద ఎత్తున నిధులు సమీకరించడం వంటి వాటితో రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభి వృద్ధికి కృషి చేస్తుందన్నారు. నాయకులు అశోక్, రమేష్, సత్యనారాయణ, సుదర్శన్, పురుషోత్తం, దాస్, మహేందర్ గౌడ్, లక్ష్మణ్, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో 'చదువులమ్మ ఒడి - మనవెంటే బడి'



ఆర్మూర్: ఆలూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆదేశాల మేరకు 'చదువులమ్మ ఒడి – మనవేంటే బడి' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు కొత్తూరు గిరీశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్యాగులు, స్టడీ టేబుళ్లను అందజేశారు. ఓబీసీ మండల అధ్యక్షులు నడిశెరం మల్లయ్య, ఆలూర్ మండల కార్యదర్శి అర్ష హరీశ్, 97వ బూత్ అధ్యక్షుడు నేమూరి సురేశ్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	రాజధాని ఫైల్స్ (తెలుగు) – 01.00 మేడమ్ వెబ్(ఇంగ్లీష్)- 4.20, 7.00, 9.40
స్క్రీన్-2 –	ఈగల్ (తెలుగు) – 11.30, 03.00, 6.30, 9.50
స్క్రీన్-3 –	ఊరు పేరు భైరవ కోన(తెలుగు) – 1.00, 4.00, 07.00, 10.00
స్క్రీన్-4 –	మేడమ్ వెబ్(ఇంగ్లీష్)- 12.15 హనుమాన్ (తెలుగు) – 3.30, 6.50 ఓయ్(తెలుగు) – 10.10